ఈనాడు
తమిళనాడు
ఆదివారం అక్టోబరు 20, 2024

ఖైదీలతో కలిసి కుట్రలకు పాల్పడే లాయర్లపై చర్యలు

● డీజీపీ శంకర్ జివాల్

ప్యారిస్, న్యూస్‌టుడే: ఖైదీలతో కలిసి లాయర్లు కుట్రలకు పాల్పడినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు చేపడతారని డీజీపీ హెచ్చరించారు. మహానగరాల కమిషనర్లు, ఐజీలు, డీఐజీలు, ఎస్పీలకు శుక్రవారం ఆయన పంపిన ప్రకటనలో.. జనవరి 1 నుంచి జులై 20 వరకు రాష్ట్ర జైళ్లలో ఉన్న 84 మంది రౌడీలను 396 మంది లాయర్లు 1,987సార్లు కలిసినట్లు తెలిపారు. మదురై సెంట్రల్ జైల్లో ఉన్న 15 మంది రౌడీలను మాత్రమే 546 సార్లు కలిశారన్నారు. కేసుకు సంబంధించి ఖైదీలను కలిసినా కొందరి చర్యలు అనుమానస్పదంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా కొందరు న్యాయవాదులు వెళ్లినప్పుడు జైల్లో ఉన్న అలారం మోగిందన్నారు. ఆ తర్వాత నిఘా పెట్టగా కొందరు లాయర్లు రౌడీలతో కలిసి కుట్రలకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. జైల్లో గంజాయి, సెల్‌ఫోన్ తదితర వాటిని ఖైదీలకు ఇచ్చినట్లు గుర్తించామన్నారు. ఖైదీలను కలవాలనుకునే లాయర్లు తమ పేరు, చిరునామా తదితర వివరాలతో రాతపూర్వకంగా దరఖాస్తు చేయాలన్నారు. ఆయనకు, ఖైదీకి మధ్య కేసుకు సంబంధించిన వివరాలు, సంబంధిత ఖైదీకి న్యాయపరమైన సలహాదారుడు అనేందుకు పత్రాలను జైలుశాఖ ఎస్పీ వద్ద సమర్పించాలని పేర్కొన్నారు. పత్రాలు సరిచూసిన తర్వాత అనుమతి ఇస్తారన్నారు.

హొగినేకల్‌లో ఆగిన దోనెల సవారీ



ధర్మపురి జిల్లా హొగినేకల్ జలాశయానికి శనివారం ఉదయం 17 వేల ఘనపుటడుగుల నీరు చేరింది. ప్రధాన జలపాతం, ఐందరువి, సినీఫాల్స్ తదితర ప్రాంతాల్లో ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పర్యాటకులను అక్కడికి అనుమతించడంలేదు. శనివారం 7వ రోజుగా జిల్లా యంత్రాంగం స్నానాలను నిషేధించింది. దోనెల సవారీ కూడా ఆపేశారు. ప్రధాన జలపాతానికి వెళ్తున్న మార్గాన్ని మూసేశారు. పోలీసులు గస్తీ చేపడుతున్నారు. - న్యూస్‌టుడే, విల్లివాక్కం



తమిళనాడు డీజీపీ శంకర్ జివాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ● ఆంధ్రప్రదేశ్ డీజీపీ ద్వారకా తిరుమలరావుకు.. ● పుదుచ్చేరి డీజీపీ షాలినిసింగ్‌కు..

రాష్ట్రాల సమన్వయంతో మత్తు పదార్థాల నిర్మూలన

డీజీపీల సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల నిర్మూలనకు రాష్ట్రాల ఉమ్మడి ప్రయత్నాలు అవసరమని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. గిండిలో శనివారం జరిగిన దక్షిణ రాష్ట్రాల డీజీపీల సమన్వయ సదస్సులో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణ, జల నిర్వహణ వంటి పలు విషయాల్లో దక్షిణాది రాష్ట్రాలు సంయుక్తంగా వ్యవహరిస్తున్నాయని స్టాలిన్ తెలిపారు.

■ మత్తు పదార్థాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తులు, రాష్ట్రాల మధ్య నేర చర్యలు, సైబర్ నేరాల ప్రజలను కాపాడే ఉద్దేశంతో ప్రస్తుత సదస్సు జరుగుతోందన్నారు. ఇలాంటి నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో తమిళనాడు పోలీసుశాఖ పురోభివృద్ధి సాధించిందని తెలిపారు.

■ మత్తు పదార్థాల నిర్మూలన చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ముమ్మరంగా దృష్టి సారించాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయాలపై కఠిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్ర పోలీసు శాఖ వరుస ప్రయత్నాల ఫలితంగా గంజాయి సాగుకు అడ్డుకట్ట పడిందన్నారు. నిందితులను అరెస్టు చేయడంతో పాటు ఆస్తి స్వాధీనం, బ్యాంకు ఖాతా స్తంభన, దుకాణాలకు సీల్, జరిమానా, కఠిన కారాగార శిక్షవంటి చట్టపరమైన చర్యలు ద్వారా అడ్డుకట్ట వేసినట్టు పేర్కొన్నారు. మరో వైపు మత్తు పదార్థాల విక్రయాలు అడ్డుకోవడం వంటి చర్యలు సత్ఫలితాన్ని ఇచ్చాయన్నారు.

■ ఉన్నతాధికారులతో నిర్వహించే వరుస సమీక్షల ద్వారా తమిళనాడును మత్తు పదార్థాలరహిత రాష్ట్రంగా రూపొందించే సరైన మార్గంలో పయనిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల నేరస్తులపై ఆర్థిక చర్యలు చేపట్టడంలో పోలీసు శాఖ ఆదర్శంగా ఉందన్నారు. మత్తు పదార్థాల నేరస్తుల సంబంధాలు, ఆస్తులు పలు రాష్ట్రాలకు విస్తరించాయని తెలిపారు. నేరస్తులను అరెస్టు చేసేందుకు, దర్యాప్తునకు ఇతర రాష్ట్రాలకు వెళ్లే రాష్ట్ర పోలీసులకు అక్కడి పోలీసు శాఖ సహకారం అవసరమని, అందించాలని కోరారు.

■ తమిళనాడులోకి నిషేధిత పొగాకు ఉత్పత్తులు రావడాన్ని అడ్డుకోవడానికి పొరుగు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ఇటీవల కేరళ పోలీసు శాఖ ఇచ్చిన సమాచారంతో నామక్కల్ జిల్లాలో నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. తద్వారా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించే స్పిరిట్‌తో నకిలీ మద్యం తయారు చేసే పరిశ్రమను కనిపెట్టారని పేర్కొన్నారు. ఇలాంటి హాని కలిగించే వాటిని రాష్ట్రంలోకి చొరబడటాన్ని అడ్డుకోవడానికి సరిహద్దుల్లో కఠిన తనిఖీలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

■ సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో ఏఎన్‌పీఆర్ కెమెరాలు, అత్యాధునిక కెమెరాలు వంటివి ఉపయోగించడం ద్వారా నిషేధిత వస్తువులు, నేరాల్లో ఉపయోగించిన వాహనాలు, నేరస్తులను గుర్తించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయొచ్చన్నారు.

■ సరిహద్దుల్లేకుండా చెలరేగుతున్న సైబర్ నేరాల అడ్డుకట్టకు అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతుల వ్యవహారాల్లోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ధీరజ్‌కుమార్, డీజీపీలు శంకర్ జివాల్(తమిళనాడు), అలోక్ మోహన్(కర్ణాటక), షేక్ దర్వేష్ సాహెబ్ (కేరళ), షాలిని సింగ్(పుదుచ్చేరి), ద్వారకా తిరుమలరావు(ఆంధ్రప్రదేశ్), అండమాన్ నికోబార్‌కు చెందిన ఉన్నతాధికారులు పలువురు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు సాయం

శివ పీపుల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న చెన్నై యువతి

విజయ లక్ష్మి



పేదింట్లో పుట్టినా చదువుపై మక్కువ పెంచుకుంది. తల్లిదండ్రుల కష్టాలు చూస్తూ పెరిగిన ఆమె సాయం విలువ తెలుసుకుంది. ఆత్మవిశ్వాసంతో ఉన్నతస్థానానికి చేరుకుంది. కష్టాల్లో ఉన్నవారికి, పేదలకు చేయూత అందించేందుకు ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఆమే చెన్నై అన్నానగర్‌కు చెందిన విజయలక్ష్మి. శివ పీపుల్ ఫౌండేషన్ స్థాపించి సేవా ప్రయాణం కొనసాగిస్తున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

- న్యూస్‌టుడే, ఆర్కేనగర్

నా న్న హోటల్‌లో పనిచేసేవారు. అమ్మ మహాలక్ష్మి. పేరులో లక్ష్మీ ఉండేది తప్ప ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. ఒక్కదాన్నే కుమార్తె అయినా నాన్న సంపాదించేది కుటుంబ జీవనానికి సరిపోయేది కాదు. గుడిసెలో నివసిస్తుండేవాళ్లం. అదే సమయంలో నాన్న తరచూ అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవారు.. వైద్య ఖర్చులకు కూడా డబ్బుల్లేని పరిస్థితి. హోటల్‌లో పని చేస్తే వచ్చే సంపాదన సరిపోకపోవడంతో నాన్న మూటలు మోసేవారు. చిన్న వయసు నుంచి ఆయన కష్టాలు చూస్తూ పెరిగాను. ఒళ్లునొప్పులతో రాత్రిపూట ఇంటికి వచ్చి బాధపడుతుండటం నన్ను కలచివేసేది. ఎన్ని కష్టాలున్నా... సాయం కోసం వచ్చేవారికి మా అవసరాలను తగ్గించి అమ్మ చేయూత ఇచ్చేది. అది చూసే నాకూ సాయపడాలనే ఆలోచన మొదలైంది. భవిష్యత్తులో నేను కష్టపడకూడదని నాన్న కష్టపడి చదివించారు. అందుక తగ్గట్టే నేనూ బాగా చదువుతూ వచ్చాను. ప్లస్‌టూ పూర్తి చేసి కళాశాలలో చేరే సమయానికి నాన్నకు గుండెపోటు వచ్చి నన్ను అమ్మను వదిలేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత అమ్మ కష్టపడి కూలీ పనులు చేసి నన్ను కళాశాలలో చేర్పించింది. బీకాం చదువుతూనే పార్ట్‌టైంగా మెడికల్‌షాప్‌లో పనిచేస్తు వచ్చాను. ఆ తర్వాత ఎంబీఏ పూర్తి చేశాను.

ఉన్నతోద్యోగం మానేసి..

చదువు ముగించగానే ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నా ప్రతిభతో అంచెలంచెలుగా ఉన్నతస్థాయికి చేరుకున్నాను. మేనేజర్ పదవిలో మంచి వేతనం వచ్చేది. చిన్న వయసు నుంచే కష్టాలు ఎదుర్కోవడంతో మాలాంటి వారికి సాయపడాలనే ఆలోచనతో శివ పీపుల్ ఫౌండేషన్‌ను ఐదేళ్ల కిందట ప్రారంభించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి చీరల వ్యాపారాన్ని ప్రారంభించాను. కంపెనీలో పనిచేస్తున్నప్పుడు సమాజ సేవకు సమయాన్ని వెచ్చించలేమని మానేసి సొంతంగా వ్యాపారం మొదలుపెట్టాను. తల్లిదండ్రులు కోల్పోయినవారికి, సింగిల్ పేరెంట్ పిల్లలకు ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహాయాలు చేస్తున్నాను. మా ప్రాంతంలోని 45 మంది అనాథపిల్లలు, 15 మంది దివ్యాంగులు, 25 మంది నిరాశ్రయ వృద్ధులు, 180 మంది కటిక పేదరికంలోని కుటుంబాలకు ఆహారం, వస్త్రాలు, జీవనాధారానికి సంబంధించినవి అందిస్తున్నాను. పేద పిల్లలకు పోషకాహారం, దుస్తులు, ఆటవస్తువులు పంపిణీ చేస్తున్నాం.

కృతజ్ఞతలే అవార్డులు..

వృద్ధులకు ప్రతినెలా వైద్య ఖర్చులకు సాయపడుతున్నాం. రోడ్డుపక్కన ఉంటున్నవారికి అన్నదానం, దుప్పట్లు ఇస్తున్నాం. పండుగ సమయాల్లో పేదలకు కొత్త వస్త్రాలు, స్వీట్లు ఇచ్చి వారిలో ఆనందం నింపుతున్నాం. సేవ గురించి తెలిసినవారు తోచినంత నగదు లేదా వస్తువుల రూపంలో అందించి మద్దతిస్తున్నారు. వయనాడు ప్రమాదం నన్ను ఎంతగానో కలచివేసింది. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు మా వంతు సాయం చేశాం. వాళ్లు చెప్పిన కృతజ్ఞతలు ఎన్నో అవార్డులు పొందిన సంతృప్తిని అందించాయి. చిన్నప్పటి నుంచి కష్టాలు, సవాళ్లను అధిగమించి ఉన్నతస్థాయికి చేరుకున్నాను. సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలన్నదే ధ్యేయం.



తల్లితో, పేదలకు సహాయకాలు అందిస్తూ..

తమిళ్ వర్సిటీ స్నాతకోత్సవంలో

తమిళతల్లి గీతం పూర్తిగా ఆలాపన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ తమిళ్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం ఉపకులపతి తిరువళ్లువన్ నేతృత్వంలో శనివారం జరిగింది. గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొని 100 మందికి డాక్టరేట్, 212 మందికి పీజీ, 190మందికి యూజీ, ఇంకా పలు కోర్సుల్లోని వారికి కలిపి మొత్తంగా 656 మంది విద్యార్థులకు పట్టాలు అందించారు. ఉత్తమ మార్కులు సాధించిన 8 మందికి బంగారు పతకాలు బహూకరించారు. శ్రీలంక, సింగపూర్, మలేషియా, ఇంగ్లాండ్ తదితర దేశాలకు చెందిన 25 మంది విద్యార్థులు డాక్టరేట్ పొందారు. దివ్యాంగులు, హిజ్రా పట్టా అందుకున్నారు. తమిళాభివృద్ధి, సమాచారశాఖ మంత్రి స్వామినాథన్ గైర్హాజరయ్యారు. స్నాతకోత్సవంలో తమిళ్‌తల్లి ప్రార్థనాగీతాన్ని పూర్తిగా ఆలపించడం గమనార్హం.



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

తమిళ భాషకు మోదీ సర్కార్ చేసిందేమిటి?

● రాజ్యాంగ విరుద్ధంగా రాజకీయాలు మాట్లాడుతున్న గవర్నర్
● సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: నగరంలో శుక్రవారం జరిగిన 'హిందీ మాసం' వేడుకల ముగింపు కార్యక్రమంలో తమిళతల్లి ప్రార్థనా గీతంలో 'ద్రావిడ' పదం ఉన్న పాదాన్ని విడిచిపెట్టి ఆలపించటం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. గవర్నర్ సమక్షంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఉద్దేశపూరితంగానే జరిగినట్లు రాజకీయపక్షాలు ఆరోపిస్తున్నాయి. గవర్నర్‌కు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి సహా పలు రాజకీయ పార్టీలు ప్రకటనలు విడుదల చేశాయి. ముఖ్యమంత్రి ఖండనకు గవర్నర్ ఆర్.ఎన్.రవి స్పందించారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌కు కొన్ని ప్రశ్నలు అంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన విడుదల చేశారు. అందులో.. తమిళతల్లి ప్రార్థనా గీతాన్ని పూర్తిగా భక్తిశ్రద్ధలతో పాడతానని చెప్పే మీరు అసంపూర్ణంగా ఆలపించిన వెంటనే ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు. ప్రార్థనా గీతాన్ని స్పష్టంగా పాడమని చెప్పి ఉంటే ఇలా వ్యతిరేకత ఎదుర్కొనే పరిస్థితి ఉండదు కదా అన్నారు. జాత్యహంకారం ఆరోపణ చేసినట్లు తనను గవర్నర్ విమర్శించారని, తమిళ భాషాభక్తిని ఆయన అలా భావిస్తే తమకు గర్వకారణమేనని తెలిపారు. తమిళాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారని చెప్పే మోదీ సర్కారు అందుకు ఏం చేసిందని ప్రశ్నించారు. 2013-2014 నుంచి 2022-23 వరకు సంస్కృత భాష అభివృద్ధికి దిల్లీలోని కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయానికి రూ.2,029 కోట్లు, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి రూ.406 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఇది అంతకుముందుకు పదేళ్లలో చేసిన ఖర్చుకు రెండున్నర రెట్లు ఎక్కువన్నారు. ఇదే కాలంలో తమిళ భాషాభివృద్ధికి రూ.167 కోట్లు మాత్రమే వెచ్చించారన్నారు. గతంలో గవర్నర్ తమిళనాడు పేరుకు బదులు 'తమిళం' అని సంబోధించాలని, 'ద్రావిడ' అనే విషయాన్ని బ్రిటీష్‌వారు పరిచయం చేశారని చెప్పడాన్ని మర్చిపోగలమా అని ప్రశ్నించారు. ద్రావిడ మోడల్ కాలం చెల్లిన సిద్ధాంతం అని ఓ ఇంటర్వ్యూలో చెప్పడం నేడు తమిళ తల్లి ప్రార్థనా గీతం వరకు వచ్చి నిలిచిందని గుర్తు చేశారు. తమిళాన్ని ప్రేమిస్తున్నట్లు చెప్పే గవర్నర్ గతంలో తిరువళ్లువర్ చిత్రపటాన్ని కాషాయరంగులో ఎందుకు విడుదల చేశారని ప్రశ్నించారు. తమిళంపై కేంద్ర భాజపా సర్కారుకు భక్తి ఉండటం నిజమైతే తిరుకురళ్‌ను జాతీయ గ్రంథంగా ఎందుకు ప్రకటించలేదన్నారు. గవర్నర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగ విరుద్ధంగా రాజకీయాలు మాట్లాడటం, రాజ్‌భవన్‌ను రాజకీయ కార్యాలయంగా మార్చడం, ద్రావిడ జాతిని కించపరచి మాట్లాడటం ఏ విధమైన నాగరికత అన్నారు. శాసనసభలో చదివిన ప్రసంగంలోనూ ద్రావిడ మోడల్, పెరియార్, అంబేడ్కర్, కామరాజర్, అన్నాదురై, కరుణానిధి వంటి పేర్లను విడిచి పెట్టలేదా అన్నారు. గవర్నర్ వైఖరి ఇలా ఉంటే తమిళతల్లి ప్రార్థనా గీతంలో 'ద్రావిడ' పదం ఉన్న వాక్యాన్ని యాదృచ్ఛికంగా విడిచిపెట్టారంటే తమిళులు ఎలా నమ్ముతారన్నారు. గవర్నర్‌గా కొనసాగాలంటే వేర్పాటువాద శక్తుల నుంచి విడిపించుకుని రాజ్యాంగ విధివిధానాల మేరకు బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.

ప్రజల ఆలోచనలకు విరుద్ధంగా గవర్నర్ వ్యాఖ్యలు

కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం



ప్యారిస్, న్యూస్‌టుడే: హిందీ మాట్లాడే పలు రాష్ట్రాల్లోని యువతకు ఒక్క భాష మాత్రమే తెలుసని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం తెలిపారు. శివగంగై జిల్లా కారైక్కుడిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర గవర్నర్ పాల్గొన్న దూరదర్శన్ కార్యక్రమంలో తమిళ తల్లి ప్రార్థన గీతంలో కొన్ని పదాలు తొలగించిన విషయాన్ని విలేకరులు ప్రశ్నించారు. ఆయన జవాబిస్తూ.. ప్రజల్లోని ఉద్దేశాలు, ఆలోచనలకు వ్యతిరేకంగా గవర్నర్ మాట్లాడుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో త్రిభాషా విధానం ఉందనడం సరికాదన్నారు. హిందీ మాట్లాడే పలు రాష్ట్రాల్లో ఏకభాషా విధానం ఉందని తెలిపారు. అక్కడ ఆంగ్లం నేర్పించరని, ఆ ఉపాధ్యాయులు లేరని చెప్పారు. తమిళనాడులో ఏళ్లుగా ద్విభాషా విధానాన్ని ప్రభుత్వాలు పాటిస్తున్నాయని గుర్తు చేశారు. ఇష్టం ఉన్నవారిని హిందీ చదవకూడదని చెప్పలేదని, చెన్నైలో హిందీ ప్రచారసభ ఉందని, వారు నిర్వహించే పరీక్షల్లో వేల మంది విద్యార్థులు చదివి ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలకు వెళ్తున్నారని తెలిపారు. ప్రైవేటు, సీబీఎస్ఈ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల్లో హిందీ బోధిస్తున్నట్లు చెప్పారు. హిందీ ఇష్టపడి చదివే వారికి ఎలాంటి అడ్డులేదన్నారు.

దురుద్దేశంతోనే ఆరోపణలు

కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై వరదపై ప్రజల దృష్టి మళ్లించేందుకే తమిళ తల్లి గీతం విషయాన్ని పెద్దది చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఆరోపించారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. డీడీ తమిళ్ కార్యాలయంలో వినిపించిన తమిళతల్లి గీతంపై చర్చ పూర్తిగా జనాన్ని పక్కదోవ పట్టించడమేనన్నారు. ప్రపంచవ్యాప్తంగా తమిళ భాషకు గౌరవం తెచ్చినవారు ప్రధాని మోదీ అన్నారు. కార్యక్రమంలో జరిగిన పొరపాటుకు గవర్నర్ ఎలా బాధ్యులవుతారని ప్రశ్నించారు. డీఎంకే నాయకులు దురుద్దేశంతోనే ఆర్.ఎన్.రవిపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. డీడీ ఛానల్ తరఫున క్షమాపణ కోరారని గుర్తు చేశారు. హిందీ మాసం కాంగ్రెస్, డీఎంకే కూటమి ప్రభుత్వం సమయంలోనూ జరిగిందని తెలిపారు.

హిందీకి వ్యతిరేకం కాదు: దురైవైగో

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: హిందీ భాషకు తాము వ్యతిరేకులం కాదని ఎంపీ దురైవైగో తెలిపారు. ఆ భాషను రుద్దాలనే చూస్తేనే వ్యతిరేకిస్తామన్నారు. శనివారం పుదుకోట్టైలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలచేత ఎన్నుకున్న ప్రభుత్వంలోని మంత్రివర్గ తీర్మానాన్ని గవర్నర్ పూర్తి మద్దతుతో ఆమోదించాలని చెప్పారు. మూడేళ్లుగా గవర్నర్ పలు పథకాలకు అడ్డుకట్ట వేశారన్నారు. ప్రభుత్వం ఉత్తమ పాలన అందించేందుకు గవర్నర్ పలు ఆటంకాలు సృష్టించారని ఆరోపించారు. కోర్టుకు వెళ్లి తీర్పులు పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. భారీ వర్షాల నుంచి చెన్నైకు నష్టం తప్పిందంటే ప్రభుత్వ నిర్వాహకులు, కార్పొరేషన్ సిబ్బంది తదితరులే కారణమన్నారు.

ప్రార్థనా గీతం వ్యవహారంపై విచారణ

చెన్నై, న్యూస్‌టుడే: తమిళతల్లి ప్రార్థనా గీతంలో ఓ పాదాన్ని విడిచిపెట్టి పాడిన వ్యవహారం వివాదాస్పదమైన నేపథ్యంలో దూరదర్శన్ తమిళ ఛానల్ కార్యాలయం శనివారం విచారణ చేపట్టింది. చెన్నై దూరదర్శన్‌లో వేడుకల సమయంలో తమిళతల్లి ప్రార్థనా గీతాన్ని సంగీత నాటక విభాగంలోని ఓ సీనియర్ అధికారిణి పాడటం ఆనవాయితీ. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు బదులు కార్యక్రమ విభాగంలోని నలుగురు మహిళా ఉద్యోగులు పాడినట్లు తెలిసింది. వారిలో ఇద్దరు 'ద్రావిడ' పదం ఉన్న పాదానికి బదులు మరొక పాదాన్ని ఆలపించడమే గందరగోళానికి కారణంగా చెబుతున్నారు. తమిళ తల్లి ప్రార్థనా గీతాన్ని పాడిన నలుగురు ఉద్యోగులను శనివారం దూదర్శన్ సీనియర్ అధికారి విచారించారు.

నటుడు ధనుష్, ఐశ్వర్య విడాకుల కేసు విచారణ వాయిదా

ప్యారిస్, న్యూస్‌టుడే: నటుడు ధనుష్, ఐశ్వర్యల విడాకుల కేసు విచారణ రెండోసారి వాయిదా పడింది. దర్శకుడు కస్తూరి రాజా కుమారుడు, నటుడు ధనుష్, నటుడు రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యలకు 2004లో వివాహమైంది. కొన్నేళ్లుగా విడిగా ఉంటున్న వారిద్దరు విడాకులు కోరి చెన్నై కుటుంబ సంక్షేమ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కిందటిసారి విచారణకు వచ్చినప్పుడు ఇద్దరూ గైర్హాజరయ్యారు. శనివారం మళ్లీ విచారణకు రాగా ఇద్దరూ హాజరుకాలేదు. న్యాయమూర్తి విచారణ నవంబరు 2కి వాయిదా వేశారు.



విమానాశ్రయంలో ఆచార్యులు

ఆస్ట్రేలియాలో ఆచార్యులకు శిక్షణ

ముగించుకుని చెన్నై తిరిగిరాక

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు ప్రభుత్వ 'నాన్ ముదల్‌వన్' కింద ఆస్ట్రేలియాలో ప్రత్యేక శిక్షణ పొందిన ప్రొఫెసర్లకు చెన్నై విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరం ఫీనిక్స్ అకాడమీలో నాన్ ముదల్‌వన్, తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ, పశ్చిమ ఆస్ట్రేలియా ప్రభుత్వం సంయుక్తంగా ప్రత్యేక వృత్తి శిక్షణ నిర్వహించారు. శిక్షణలో తమిళనాడు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్సు, ఇంజినీర్, పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు పాల్గొన్నారు. మూడు వారాల శిక్షణ ముగించుకుని ఆస్ట్రేలియా నుంచి చెన్నై చేరుకున్న 15 మంది ప్రొఫెసర్లు, తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రణాళికా డైరెక్టర్ శాంతిను తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ, నాన్ ముదలవన్ పథక అధికారులు చెన్నై విమానాశ్రయంలో స్వాగతించారు.

విమానాశ్రయంలో 'మెట్రో' రెండో పార్కింగ్

● వచ్చే నెలలో ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ప్రస్తుతం చెన్నైలో రెండు మార్గాల్లో 54 కి.మీ. మేర మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. సెంట్రల్, ఎగ్మూర్ విమానాశ్రయం సహా 41 రైల్వేస్టేషన్‌లలో వాహన పార్కింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. 28 స్టేషన్లో కార్లు నిలిపే వీలుంది. విమానాశ్రయ మెట్రోకు ప్రయాణికుల రాక పెరుగుతోంది. అక్కడి వాహన పార్కింగ్ ఉదయం 10 గంటలకే నిండిపోతోంది. అనంతరం వచ్చినవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయంలో కి.మీ. మేర రూ.45 లక్షలతో వాహన పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ. . ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయని, వచ్చేనెలలో ముగించి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇక్కడ ఒకే సమయంలో 54 కార్లు, 300కు పైగా ద్విచక్ర వాహనాలు నిలిపే సౌకర్యం ఉందని వివరించారు.



ప్రస్తుత పార్కింగ్ స్టాండ్

మురుగన్ ఆలయాలకు ఆధ్యాత్మిక పర్యటన

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కుంభకోణం ప్రభుత్వ రవాణసంస్థ తరఫున ఆరు మురుగన్ ఆలయాలను దర్శించుకునేలా కొత్త బస్సును తిరుప్పందాల్ అరుణజటేశ్వర ఆలయంలో ప్రారంభించారు. డెల్టా జిల్లాలోని ప్రసిద్ధి చెందిన ఆరు ఆలయాలను ఒకేరోజున దర్శనం చేసుకునేలా ప్రభుత్వ రవాణ సంస్థ బస్సు ఏర్పాటు చేసింది. కొత్తబస్సును శనివారం తిరుప్పందాల్ కాశీ తిరుమడం ఆధీనం శ్రీలశ్రీ ముత్తుకుమార తంబిరాన్ స్వాములు, రవాణశాఖ మంత్రి శివశంకర్, ఉన్నతవిద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్ జెండా ఊపి ప్రారంభించారు. 41మంది ప్రయాణికులకు టోపీ, పుష్పగుచ్ఛం, శాలువా అందించి సాగనంపారు. బస్సు కుంభకోణం బస్టాండ్ నుంచి ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 6.30కు బయలుదేరి తిరువారూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం, నాగపట్టిణంలోని సింగార వేలవర్‌స్వామి ఆలయం, ఎట్టుకుట్టి సుబ్రమణ్యస్వామి ఆలయం, స్వామిమలై స్వామినాథ ఆలయం, కందసామి తదితర ఆలయాలకు వెళ్లి తిరిగి సాయంత్రం 6.30కు కుంభకోణం వచ్చి చేరుతుంది.



బస్సును ప్రారంభిస్తున్న ఆధీనం, మంత్రులు

నవంబరు 1న సెలవు

ప్రకటించిన ప్రభుత్వం

చెన్నై, న్యూస్‌టుడే: ఈ ఏడాది దీపావళి 31న జరుగనున్న నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లి తిరిగొచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమార్థం నవంబరు 1న సెలవుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అందుకు బదులుగా నవంబరు 9న పనిదినంగా ప్రకటించింది.



దినేష్ దశరథన్‌కు జ్ఞాపిక అందిస్తున్న వర్సిటీ ఉపకులపతి డా.ఎస్.మోహన్

నేవీలో చేరికతో దేశసేవకు చక్కటి అవకాశం

టీనగర్, న్యూస్‌టుడే: నావికాదళంలో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు దేశసేవ చేయాలని బీటెక్ విద్యార్థులకు భారత నావికాదళం అధికారులు పిలుపునిచ్చారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పుదుచ్చేరి టెక్నలాజికల్ యూనివర్సిటీలో శుక్రవారం కార్యక్రమం జరిగింది. ఉపకులపతి డా.ఎస్.మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి భారత నావికాదళ కమాండర్లు దినేష్ దశరథన్, ఎ.పార్తిబన్, వి.గణేశ్‌లతో కూడిన బృందం హాజరైంది. నావికాదళం సేవలను వివరించారు. విద్యార్థుల విభాగ డీన్ సుధ, యూనివర్సిటీ ప్లానింగ్, డెవలప్‌మెంట్ విభాగ డైరెక్టర్ సెల్వరాజు, పూర్వ విద్యార్థి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రవర్తనను భాషతో ముడిపెట్టడం సరికాదు

వడపళని, న్యూస్‌టుడే: తెలుగు రౌడీలని పేర్కొంటూ న్యాయవాది పి.విల్సన్ చెన్నై నగర పోలీసు కమిషనరుకు అందజేసిన సమాచారాన్ని ‘ఆలిండియా తెలుగు ఫెడరేషన్’ (ఏఐటీఎఫ్) ఖండించింది. ఏడాదిగా పోలీసులకు పట్టుబడుతున్న నేరస్థులను భాషతో పోల్చడం సరికాదని తెలిపింది. వ్యక్తి ప్రవర్తనకు భాషను ముడిపెట్టడం సరికాదంది. న్యాయవాది ఆవిధంగా మాట్లాడటం భావ్యం కాదని, ఆయన నుంచి మంచి సమాధానం వస్తుందని ఎదురు చూస్తున్నానని ఏఐటీఎఫ్ అధ్యక్షుడు, ఆచార్యులు, సీఎంకే రెడ్డి శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నెలలో 74,500 రాంగ్ రూట్ కేసులు

– న్యూస్‌టుడే, వడపళని

నమోదు చేసిన ‘జీసీటీపీ’

గ్రేటర్ చెన్నై ట్రాఫిక్ పోలీసు (జీసీటీపీ) విభాగం తరచూ ప్రత్యేక నిఘా బృందంతో ఆకస్మిక తనిఖీలు చేసి రాంగ్ రూట్‌లో వచ్చిన వారికి జరిమానాలు విధిస్తూ హెచ్చరికలు చేస్తోంది. అయినా చాలామంది వాహన చోదకుల్లో మార్పు కనిపించట్లేదు. నిబంధనలకు తిలోదకాలిచ్చి నడుపుతున్నారు. వీటిని అరికట్టేందుకు ట్రాఫిక్ విభాగం తమ నిఘాను మరింత బలపరిచింది. ఆ క్రమంలోనే కేవలం నెల రోజుల్లో 74,500 మంది వాహన చోదకులపై కేసులు నమోదు చేసింది. పట్టుబడ్డ వారినుంచి డ్రైవింగ్ లైసెన్సులు స్వాధీనం చేసుకుని,



‘నో యూ టర్న్’ సూచిక బోర్డు

జరిమానాలు కూడా విధించింది. 2023తో పోలిస్తే నెలరోజుల వ్యవధిలో బుక్ అయిన కేసులు రెండింతలుగా ఉన్నాయి. వాహనాల రద్దీ ఉండే ముఖ్య ప్రాంతాలైన మాధవరం పరిసరాలు, అడయార్‌లోని లాటిస్ బ్రిడ్జి రోడ్డు కూడలి, 200 అడుగుల రేడియల్ రోడ్డు వంటి 102 చోట్ల జీసీటీపీ ప్రత్యేక బృందంతో నిఘా ఉంచింది. తరచూ పోలీసుల తనిఖీలతో పాటు హాట్‌స్పాట్లలో నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారి కదలికలు రికార్డు చేసి, అప్పటికప్పుడు ఈ-చలాన్లు అందించేందుకు బారికేడ్లతో పాటు ‘ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్’ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు కూడా ఏర్పాటు చేసింది. ఈ విధమైన చర్యలతో గత నెలలో 26,330 కేసులు బుక్ చేశారు.

రోడ్లు సరిగా లేకనే...

నగరంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, మెట్రో పనులు, పైవంతెన, ఇతర పనుల కారణంగా పలు ప్రాంతాల్లో వాహనాల దారి మళ్లింపులు ఉన్నాయని, త్వరగా కార్యాలయాలు, కళాశాలలకు చేరుకోవాలనే ఆలోచనతో రాంగ్ రూట్లలో వెళ్లాల్సి వస్తోందని పలువురు వాహన చోదకులు వాపోతున్నారు. ఆలందూరు ప్రాంతంలో మెట్రో పనుల కారణంగా అషర్‌ఖానా వీధి నుంచి తిరిగి రావాలంటే రెండు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాలని, కావున అనేక మంది ఆలందూరు రైల్వే స్టేషను రోడ్డు గుండా రాంగ్ రూట్‌లో వస్తున్నారు.



వడపళని కూడలి



వెంకటనారాయణ రోడ్డులో..

ట్రాఫిక్ విభాగంపై విమర్శలు.. ట్రాఫిక్ విభాగం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు బుక్ చేసినా జరిమానాలు సరిగ్గా వసూలు చేయడం లేదనే విమర్శలు తలెత్తాయి. ఈ క్రమంలో మూడు రకాల చర్యలపై ఆ విభాగం దృష్టి సారించింది. జరిమానాలు చెల్లించని వారి ఇళ్లకు వెళ్లేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటైంది. కాల్ సెంటర్ నుంచి జరిమానా చెల్లించాలని గుర్తు చేయడం, క్షేత్ర స్థాయి అధికారులు జరిమానాలు కట్టనివారిని తనిఖీ చేయడం. అలా జరిమానాలు కట్టనివారి లైసెన్సులు మూడు నెలలపాటు రద్దు చేస్తామని హెచ్చరించడం చేస్తోంది. ఈ రకమైన చర్యలతో జరిమానా వసూళ్లు బాగానే పెరిగాయని, 70శాతం మంది సకాలంలోనే చెల్లిస్తున్నారని ట్రాఫిక్ విభాగ అదనపు కమిషనరు ఆర్.సుధాకర్ పేర్కొన్నారు. మితిమీరిన నేరాలకు పాల్పడిన సందర్భాలలో కూడా ఇదే పద్ధతిని అవలంబించాలనుకుంటున్నామని ఆయన చెప్పారు.

తరచూ రాంగ్ రూట్‌లో వచ్చే ప్రదేశాలు

❖ చెన్నై ఉత్తరం - 30, దక్షిణం - 35, తూర్పు - 37. ఇక్కడ ఉన్న కెమెరాలు - 27. బుక్ అయిన కేసులు ఉత్తరం - 17,431, దక్షిణం - 14,460, తూర్పు - 16,296. కెమెరాలతో గుర్తించినవి - 26,335.

హాట్ స్పాట్లు... ఉత్తర చెన్నై - తంబు చెట్టి వీధి, రెట్టేరి జంక్షన్, వానగరం టోల్‌గేట్, అయ్యప్ప థియేటర్ సమీపం జీఎన్‌టీ రోడ్డు. ❖ దక్షిణ చెన్నై - తనికాచలం రోడ్డు-వెంకటనారాయణ రోడ్డు, వడపళని జంక్షన్, ఎల్బీ రోడ్డు సిగ్నల్, సీఐఎస్‌ఆర్ రోడ్డు, ఎస్.కొలత్తూరు సమీపం 200 అడుగుల రేడియల్ రోడ్డు. తూర్పు చెన్నై - బర్నబి రోడ్డు జంక్షన్, నమశ్శివాయపురం సబ్‌వే ప్రవేశ ద్వారం, వళ్లువర్ కొట్టం జంక్షన్, ఎగ్మూరు ఉడిపి జంక్షన్, పీఎస్ శివస్వామి సాలై.

❖ కొత్తగా అమలైన మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానా రూ.500 నుంచి రూ.1,000 వరకు పెరిగింది.

ఈశాపై వస్తున్న ఆరోపణలపై దర్యాప్తు జరపాలి: ముత్తరసన్

చెన్నై, న్యూస్‌టుడే: కోయంబత్తూర్ జిల్లాలోని ఈశా ఫౌండేషన్ ఆశ్రమంపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ డిమాండ్ చేశారు. ఆయన తన ప్రకటనలో.. ఈశా ఫౌండేషన్ ఆశ్రమంలో చేర్పించిన తన ఇద్దరి కుమార్తెల విషయమై విశ్రాంత అధ్యాపకులు కామరాజ్ ఇటీవల మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడాన్ని ఉటంకించారు. ఈశా ఫౌండేషన్ ఆశ్రమంపై వచ్చిన అన్ని ఆరోపణల ప్రస్తుత పరిస్థితిపై నివేదిక సమర్పించాలని పోలీసు శాఖను హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. సంబంధిత నివేదిక సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యిందని పేర్కొన్నారు. ఆశ్రమం కేసులను తమిళనాడు ప్రభుత్వం, పోలీసు దర్యాప్తునకు స్టే లేదంటూ అప్పీల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మద్యం విక్రయాలు పెంచేందుకు టాస్మాక్ చర్యలు: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: మద్యం విక్రయాలు పెంచడమే ద్రావిడ మోడల్ డీఎంకే ప్రభుత్వ తారక మంత్రమా? అని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ ప్రశ్నించారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడులో ప్రతిరోజూ రూ.2 లక్షల కంటే ఎక్కువగా వ్యాపారం జరిగే 3,500కు పైగా మద్యం దుకాణాల్లో రెండో కౌంటర్ తెరిచేందుకు టాస్మాక్ నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. వచ్చే వారంలోగా ఈ కౌంటర్లు తెరిచే అవకాశం ఉందన్నారు. మద్యం విక్రయాలు మరింతగా పెంచే ఉద్దేశంతో టాస్మాక్ తీసుకుంటున్న ఈ చర్యలు దారుణమన్నారు. మద్యాన్ని నిర్మూలించడం ప్రభుత్వ విధానంగా ఉండాలేగాని విక్రయాలను పెంచడం కాదన్నారు. కావున అదనపు కౌంటర్లు ప్రారంభించే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తిరువణ్ణామలై కార్తిక దీపోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో జరుగనున్న కార్తిక దీపోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టరు కార్యాలయంలో జరిగింది. జిల్లా కలెక్టరు భాస్కరపాండియన్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రులు ఏవీ వేలు, పీకే శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొని వివిధ శాఖల అధికారులతో చర్చించారు. భక్తులకు కనీస వసతులు, భద్రతా ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు చక్కగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ విలేకరులతో మాట్లాడుతూ.. కార్తిక మహాదీపోత్సవాలు డిసెంబరు 1 నుంచి 17వ తేదీ వరకు 17 రోజుల పాటు జరుగుతాయన్నారు. డిసెంబరు 10న రథోత్సవాలు జరుగుతాయని, ఆ రోజు ఆరు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. ముఖ్య ఉత్సవమైన మహాదీపోత్సవం డిసెంబరు 13వ తేదీ జరుగనుందని తెలిపారు. ఆ రోజు 40 లక్షల నుంచి 50 లక్షల వరకు భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. భక్తుల కోసం రూ.30 కోట్లతో పలు శాఖల తరఫున వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి, ఎంపీలు అన్నాదురై, ధరణివేందన్, ఎమ్మెల్యేలు గిరి, జ్యోతి, శరవణన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి శేఖర్‌బాబు, అధికారులు

బిల్లుల చెల్లింపులో అప్రమత్తత అవసరం

వడపళని, న్యూస్‌టుడే: నీటి పన్ను, ఇతర ఛార్జీలు చెల్లించే వినియోగదారులు మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని చెన్నై మహానగర నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ మండలి (సీఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. గుర్తు తెలియని వ్యక్తులు వినియోగదారులకు ఫోన్లు చేసి బకాయిలను చెల్లించడానికి ఓ లింకును పంపి అందులో ఉన్న బ్యాంకు ఖాతాకు యూపీఐ, జీపే, పేటీఎం ద్వారా చెల్లించాలని చెబుతున్నారనే ఫిర్యాదులందాయని అధికారులు పేర్కొన్నారు. బకాయిలు చెల్లించని పక్షంలో కనెక్షన్లు తొలగిస్తామని బెదిరిస్తున్నారని, అలాంటి ఫోన్లను నమ్మి మోసపోవద్దని, వినియోగదారులు ఎప్పటిలాగానే https:///www.cmwssb.tn.gov.in లేదా https:///bnc.chennaimetrowater.in/#/publius–login వెబ్‌సైట్‌లో నగదు చెల్లించాలని పేర్కొన్నారు. బిల్లులు నగదు, డీడీ లేదా క్రెడిట్, డెబిట్ కార్డులతో 15 జోనల్ కార్యాలయాలు, హెడ్‌క్వార్టర్సులో చెల్లించవచ్చని తెలిపారు. ఏదేని సమస్యలుంటే 044 - 4567 4567 నెంబరుపై సంప్రదించవచ్చన్నారు.

పవన విద్యుత్తు ప్రదర్శన 23 నుంచి

వడపళని, న్యూస్‌టుడే: కేంద్ర కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు చెన్నై ట్రేడ్ సెంటర్‌లో ‘విండ్ ఎనర్జీ ఇండియా-2024’ ప్రదర్శన జరగనుంది. అంతర్జాతీయంగా 300కు పైగా ఎగ్జిబిటర్లు ప్రదర్శనలో పాల్గొననున్నారు. డెన్మార్క్, స్పెయిన్, యూకే దేశాలకు చెందిన విండ్ ఎనర్జీ సంస్థల ప్రతినిధులతో 2030 నాటికి దేశంలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులపై చర్చలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఫ్రాంక్‌ఫర్ట్‌లో తమిళ పుస్తకాల ప్రదర్శన

వడపళని, న్యూస్‌టుడే: ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో తమిళనాడు పెవిలియన్ ప్రదర్శన కూడా ఏర్పాటైంది. భారత కాన్సుల్ జనరల్ బీఎస్ ముబారక్ బుధవారం అక్కడ పుస్తక ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించారు. 2022 నుంచి ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగే ప్రదర్శనలో తమిళనాడు స్టాల్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రదర్శన ‘టేకింగ్ తమిళ్ టు ది వరల్డ్, బ్రింగింగ్ ది వరల్డ్ టు తమిళ్’ పేరిట ‘చెన్నై ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్’కు అంకితం చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తమిళ సాహిత్యాలను భారతీయ, అంతర్జాతీయ భాషల్లోకి, ఇతర భాషా పుస్తకాలను తమిళంలోకి అనువాదం చేయాలన్నదే ప్రదర్శన ముఖ్యోద్దేశమని తెలిపారు.

రైళ్ల సమాచారం

వడపళని, న్యూస్‌టుడే: అరల్‌వాయ్‌మొళి-నార్త్ పనకుడి మధ్యలో సబ్‌వే నిర్మాణం కారణంగా రైళ్ల టెర్మినల్‌లో మార్పు జరిగినట్టు దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది.

- **20691** తాంబరం-నాగర్‌కోయిల్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ 22న 23.00కు బయలుదేరే రైలు వల్లియూరు వరకు వెళ్తుంది.
- **20692** నాగర్‌కోయిల్-తాంబరం 23న 15.50కు బయలుదేరే రైలు వల్లియూరు నుంచి 16.24 గంటలకు బయలుదేరుతుంది.

ఊటీలో చిరుత సంచారం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని మంజనక్కొరై, కలైజ్ఞర్ కాలనీలో రెండు రోజుల క్రితం రాత్రి చిరుత సంచరించింది. నిద్రిస్తున్న శునకాన్ని గొంతు పట్టుకొని లాక్కెళ్తుండగా వాహనం శబ్దం రావడంతో వదిలేసి వెళ్లింది. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖవారు అక్కడికి చేరుకొని విచారణ జరిపారు. చిరుతను పట్టుకునే వరకు రాత్రి సమయాలలో ఎవరూ ఇంట్లో నుంచి బయటకు రావద్దని హెచ్చరించారు.

ఎన్ఎల్‌సీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

చెన్నై, న్యూస్‌టుడే: నైవేలిలో పోరాడుతున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్ సీమాన్ డిమాండ్ చేశారు. ఆయన తన ప్రకటనలో.. నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్‌లో పలు సంవత్సరాలుగా పనిచేస్తున్న 10వేల మంది కార్మికులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌ను నెరవేర్చకుండా ఎన్ఎల్‌సీ యంత్రాంగం మోసగించడం దారుణమన్నారు. తమిళుల భూమిని, సంపదను, శ్రమను పిండుకుని ఏడాదికి రూ.2,378 కోట్ల నికర లాభం పొందుతున్న సంస్థ ఒప్పంద ఉద్యోగులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, ఉద్యోగానికి తగిన వేతనం అందించాలని డిమాండ్ చేశారు.

జీవన్మృతుడి అవయవాల దానం



రాజా (పాతచిత్రం)

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు సమీప ఆలపాక్కం గ్రామానికి చెందిన కుమార్ కుమారుడు రాజా (26)కి భార్య నిత్యప్రియ, ఓ కుమార్తె ఉన్నారు. రాజా కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం పొత్తేరిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అతను జీవన్మృతి చెందాడు. అతని అవయవాలను దానం చేసేందుకు కుటుంబీకులు ముందుకొచ్చారు. విషయాన్ని ఆసుపత్రి యాజమాన్యం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ప్రభుత్వ లాంఛనాలతో రాజా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

తిరుచ్చి విమానాశ్రయ విస్తరణకు మార్గం సుగమం

వడపళని, న్యూస్‌టుడే: తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి స్థల సేకరణ సమస్య ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. 14 సంవత్సరాలుగా అందరూ ఎదురుచూస్తున్న స్థలానికి విముక్తి కలిగింది. తిరుచ్చి జిల్లా యంత్రాంగం భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) అధికారులకు విస్తరణ పనులు ప్రారంభించుకోవచ్చని పేర్కొంది. 2009-2019లో తిరుచ్చిలో విమానాశ్రయ విస్తరణకు ప్రతిపాదనలు జరిగాయి. అయితే దశాబ్ద కాలంగా పనులు ముందుకు సాగలేదు. స్థల సమస్య కారణంగా 8,136 అడుగుల స్థలంలో విమాన సేవలు అందిస్తోంది. విస్తరణలో 12,500 అడుగుల వరకు రన్‌వే రానుంది. ఇందులో ప్రయాణికుల, కార్గో విమానాలు సేవలందించగలవని అధికారులన్నారు. ఇటీవల కాలంలో తరచూ జిల్లా యంత్రాంగం, ఏఏఐ అధికారులు సమావేశమై చర్చలు జరిపిన అనంతరం 497 ఎకరాలకుగాను 455 ఎకరాల స్థలాన్ని ఏఏఐకి అప్పగించింది.



పగిలిన అద్దం

విమానాశ్రయంలో పగిలిన అద్దాల తలుపు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయంలో అంతర్జాతీయ, దేశీయ ప్రయాణికుల ప్రవేశ ద్వారాలకు మధ్య ఏడు అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పుతో కూడిన అద్దాల తలుపు శనివారం పగిలింది. దీంతో అటుగా నడిచి వెళ్తున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు వెంటనే ఆ తలుపుకు సీలు వేసి ప్రయాణికులను మరో ద్వారం గుండా డొమెస్టిక్ టెర్మినల్‌కు పంపారు. అద్దం పగలడానికి కారణాలు తెలియలేదని, విచారణకు ఆదేశించినట్టు అధికారులు తెలిపారు. గతంలో పాత టెర్మినల్‌లో 90 సందర్భాలలో అద్దాల తలుపులు పగిలిన సంగతి తెలిసిందే.



క్రీడాకారులకు ఉపకరణాలు అందజేస్తున్న ఉదయనిధి

క్రీడా ఉపకరణాల పంపిణీ

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై మున్సిపల్ కార్యాలయం ఎదుట యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ తరఫున కలైజ్ఞర్ క్రీడా ఉపకరణాల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తిరువణ్ణామలై, తిరుపత్తూర్, కల్లకురిచ్చి జిల్లాలకు చెందిన 1835 మంది క్రీడాకారులకు ఉపకరణాలు అందజేశారు.

ఉచిత చీర, దోవతుల ఉత్పత్తి 20 శాతం పూర్తి

నూలు సరఫరా లేక ఆలస్యం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నూలు అందజేయడంలో ఆలస్యం కావడంతో చీర, దోవతుల ఉత్పత్తి పనులు 20 శాతం మాత్రమే పూర్తయ్యాయి. సంక్రాంతి పండుగకు తెల్ల రేషన్‌కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉచితంగా చీర, దోవతులు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది 1,77,22,995 దోవతులు, 1,77,64,471 చీరల ఉత్పత్తికి ఆర్డర్ ఇచ్చారు. గత సెప్టెంబరు 6వ తేదీ నుంచి పాలిస్టర్, కాటన్ నూలు రాసాగింది. కానీ, దోవతుల బార్డర్‌కు నూలు, బాబిన్‌కుగాను సరిపడా నూలు లేని కారణంగా 15-20 శాతం ఉత్పత్తి మాత్రమే పూర్తయింది. చీరలకుగాను నూలు రావడంతో 10కి పైగా గోదాములలో నిల్వ ఉంచారు. కానీ, చేనేతల సహకార సంఘానికి అందజేయకపోవడంతో ఉత్పత్తి పనులు ముందుకు సాగలేదు. దీని గురించి పవర్‌లూం సంఘ నిర్వాహకులు మాట్లాడుతూ.. ఉచిత చీర, దోవతుల ఉత్పత్తి పనులు డిసెంబరు 30వ తేదీలోగా పూర్తి చేసి సంబంధిత జిల్లాలకు పంపాలని ప్రభుత్వం తీర్మానించినట్టు చెప్పారు. కానీ, దీపావళికి 11 రోజులున్న నేపథ్యంలో కొత్త ఆర్డర్ ఇచ్చి కూలీ మొత్తం విడుదల చేసినట్టయితే సంఘం ద్వారా బోనస్ అందజేసే అవకాశముందన్నారు. అంతేకాకుండా మునుపటి బకాయిలు రూ.123 కోట్లు అయినా అందజేస్తే కార్మికులు దీపావళి జరుపుకోవడానికి కనీస నగదు అందుతుందని పేర్కొన్నారు.

దీపావళి బహుమతి పెట్టెల విక్రయం ప్రారంభం

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ తరఫున పని చేస్తున్న మహిళా స్వయం సహాయక బృందాలు తయారు చేసిన దీపావళి బహుమతి పెట్టెలు అందుబాటులోకి వచ్చాయి. ఎర్ర బియ్యం, డ్రైఫ్రూట్స్, రాగి లడ్డూలు తదితర పలు రకాల తినుబండారాలు ఉంటాయి. ఈనెల 23 వరకు విక్రయాలు జరగనున్నాయి. దీపావళికి బహుమతిగా ఇచ్చేలా తంజావూరు బొమ్మలు, చిత్రలేఖనాలు, మట్టితో చేసిన దీపాలు, గడ్డితో చేసిన అలంకార వస్తువులు కూడా విక్రయిస్తున్నారు. బహుమతి పెట్టె కొనుగోలుకు 7603899270 నెంబర్‌ను సంప్రదించాలని సంబంధిత అధికారులు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి ఆర్.గాంధీ

మహిళా బృందాలకు రుణాల అందజేత

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా ఆర్కాడు ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉద్యోగ మేళా జరిగింది. కార్యక్రమంలో మంత్రి ఆర్.గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని 20 మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చంద్రకళ, ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వెండి రథ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

గంగాదీశ్వరర్ ఆలయ కుంభాభిషేకం 28న

ప్యారిస్, న్యూస్‌టుడే: గంగాదీశ్వరర్ ఆలయ కుంభాభిషేకం నవంబర్ 28న నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. శనివారం చెన్నై ప్యారిస్‌లోని ప్రసిద్ధ కాళికాంబాళ్ ఆలయంలో వెండి రథం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.59 కోట్ల వ్యయంతో 97 రథాలను ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా పాడైన 53 రథాలకు రూ.11.89 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. అంతేకాకుండా రూ.29 కోట్ల వ్యయంతో 5 బంగారు రథాలు, రూ.27.16 కోట్ల వ్యయంతో 9 వెండి రథాలను తయారు చేస్తున్నట్లు ప్రకటించారని, వాటిలో పెరియపాళెయం బంగారు రథం, తిరుత్తణి వెండి రథాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. పురసైవాక్కం గంగాదీశ్వరర్ ఆలయ పునరుద్ధరణ పనులు పూర్తి చేసి నవంబరు 28న కుంభాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు.

చెరకు రైతులకు ప్రోత్సాహక నిధి

టీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను చెరకు రైతులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన న్యాయమైన గిట్టుబాటు ధర రూ.2919.75తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహక మొత్తం రూ.215 కలిపి టన్నుకు రూ.3134.75 అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ప్రకటనలో... 2023-24 సీజనులో చక్కెర కర్మాగారాలకు చెరకు అందించిన రైతుల వివరాలను సేకరించినట్లు తెలిపింది. ఆ మేరకు అర్హులకు ప్రోత్సాహక మొత్తాన్ని ఆయా జిల్లాల కలెక్టర్ల సిఫార్సులతో అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించింది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.247 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొంది.

దీపావళి చీటీ పేరిట రూ.3 కోట్ల మోసం

❖ పరారీలో భాజపా నిర్వాహకుడు ❖ గాలిస్తున్న పోలీసులు



సెంథిల్‌కుమార్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళి చీటీ పేరిట రూ.3కోట్లు మోసానికి పాల్పడిన భాజపా నిర్వాహకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారి కథనం మేరకు.. తిరుప్పూర్ ఊత్తుకులి ప్రాంతానికి చెందిన సెంథిల్‌కుమార్ నాలుగేళ్లుగా కరుమారపాళ్యం భాజపా కార్యాలయంలో తిరుప్పూర్, ఈరోడ్ ప్రాంత ప్రజలకు వేలం, దీపావళి చీటీ నడుపుతూ వచ్చాడు. వెయ్యిమంది వద్ద రూ.3 కోట్ల వరకు వసూల్ చేశాడు. దీపావళి చీటీ ముగియడంతో ప్రజలకు వస్తువులు అందించే సమయానికి సెంథిల్‌కుమార్ కార్యాలయంలోని పార్టీ జెండా, నాయకుల ఫొటోలను చించేసి తాళం వేసుకుని పారిపోయాడు. శనివారం కార్యాలయం వద్దకు చేరుకున్న బాధితులు రాస్తారోకో చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సెంథిల్‌కుమార్ ప్రస్తుతం భాజపాలో లేరని తిరుప్పూర్ ఉత్తర జిల్లా పార్టీ అధ్యక్షుడు సెంథిల్‌వేల్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న బాధితులు

దోమల నివారణ సిబ్బందికి అన్ని రోజులూ పని కల్పించాలి: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: దోమల నివారణ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలో దోమల నివారణ పనులకు 30 వేల మందికిపైగా పని చేస్తున్నారని తెలిపారు. వారికి చాలా తక్కువ వేతనం ఇస్తున్నారన్నారు. తమను పర్మినెంట్ చేయాలని వారిలో చాలామంది కోర్టుల్లో కేసులు వేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి వారికి ఒక నెల పని చేస్తే తర్వాతి నెలలో ఇవ్వకూడదని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసిందన్నారు. ఈ చర్యలు ఖండించదగినవన్నారు. సిబ్బందికి అన్ని రోజులూ పని కల్పించటంతో పాటు పదేళ్లు పూర్తి చేసుకున్న తాత్కాలిక కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.

ఏనుగు గుర్తు తొలగించకుంటే చట్టపరమైన చర్యలు

విజయ్‌కు బీఎస్పీ నోటీసు

సైదాపేట, న్యూస్‌టుడే: పార్టీ జెండాలో ఏనుగు గుర్తు తొలగించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీవీకే అధ్యక్షుడు విజయ్‌కి బీఎస్పీ తరఫున లాయర్ నోటీసు పంపినట్లు తెలిసింది. పార్టీ జెండా వ్యవహారంలో జోక్యం చేసుకోవటం కుదరదని ఎన్నికల కమిషన్ ఇదివరకే తెలిపిన నేపథ్యంలో నోటీసు పంపటం గమనార్హం.

ఘనంగా బంగారు అడిగళార్ విగ్రహ కుంభాభిషేకం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో ముక్తి పొందిన ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు మూడు రోజులుగా పీఠంలో ఘనంగా జరుగుతున్నాయి. ఆదిపరాశక్తికి 16వ తేదీ నిర్వహించిన అభిషేక, ఆరాధనలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 17వ తేదీ ఆదిపరాశక్తి సన్నిధి సమీపంలో నిర్మించిన గురు పీఠంలో ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక ఉద్యమ వైస్ ఛైర్మన్ లక్ష్మీ బంగారు అడిగళార్ పాల్గొని బంగారు అడిగళార్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 18వ తేదీ రెండో కాల పూజలను నిర్వహించారు. శనివారం ఉదయం బంగారు అడిగళార్ విగ్రహానికి ఉంచిన పుణ్య జలాలతో ఆధ్యాత్మిక ఉద్యమ ఉపాధ్యక్షులు అన్బళగన్, సెంథిల్ కుమార్ తదితరులు మహా కుంభాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున ఓం శక్తి భక్తులు, ఆధ్యాత్మిక ఉద్యమ వైస్ ఛైర్మన్లు శ్రీదేవి రమేష్, ఉమాదేవి జయగణేష్, పంచాయతీ అధ్యక్షుడు అగత్తియన్, విద్యా సంస్థల కరస్పాండెంట్లు, ఆశా అన్బళగన్, శ్రీలేఖ సెంథిల్ కుమార్, ఆదిపరాశక్తి ఆస్పత్రి డైరెక్టరు డాక్టరు రమేష్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


పీఠంలో ప్రతిష్ఠించిన బంగారు అడిగళార్ విగ్రహం

పేసుం పెరుమాళ్‌కు ప్రత్యేక పూజలు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం-వందవాసి మార్గంలోని కూళ మందల్ గ్రామంలో నెలకొన్న శ్రీదేవి, భూదేవి సమేత పేసుం పెరుమాళ్ ఆలయంలో పెరటాసి మాస ఐదో శనివారం సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేక, ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణువుగా అలంకరించారు. గరుత్మంతుడిని కూడా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.


మహా విష్ణువుగా పేసుం పెరుమాళ్


అలంకరణలో గరుత్మంతుడు

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఐప్పసి మాస కృత్తిక సందర్భంగా శనివారం తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. భారీగా చేరుకున్న భక్తులతో ఆలయం కిక్కిరిసింది. మూలమూర్తికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ జరిగాయి. రుద్రాక్ష మండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. శనివారం సాయంత్రం వరకు సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.


అలంకరణలో వళ్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

శ్రీ కోదండరామాలయ ముఖద్వార మండప ప్రారంభోత్సవం నేడు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని కొరట్టూర్ అగ్రహారంలో నెలకొన్న శ్రీ కోదండరామాలయ ముఖద్వార మండప ప్రారంభోత్సవం ఆదివారం జరగనుంది. ప్రముఖ ఆర్కిటెక్ట్, ఆస్కా మాజీ అధ్యక్షుడు ఆదిశేషయ్య దీనిని ప్రారంభించనున్నారు. అనంతరం సీతారామ కల్యాణం నిర్వహిస్తారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ బీఎన్ గుప్తా కుటుంబం తరఫున ముఖద్వార మండపాన్ని నిర్మించారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని శ్రీ ఆంధ్ర కళాస్రవంతి సలహాదారుడు ఎంఎస్ మూర్తి, అధ్యక్షుడు జేఎం నాయుడు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

దీక్షితులు భగవంతుని కన్నా గొప్పవారిగా భావించకూడదు: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: దీక్షితులు తమని తాము భగవంతుని కన్నా గొప్పవారిగా భావించకూడదని మద్రాసు హైకోర్టు తెలిపింది. చిదంబరం నటరాజర్ ఆలయంలో నర్సుపై దాడి, అక్రమాలకు పాల్పడినట్లు, కనకసభలో భక్తుల దర్శనానికి సాయపడినట్లు తెలిసి నటరాజ దీక్షితులను సస్పెండ్ చేస్తూ దీక్షితుల కమిటీ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందుకు వ్యతిరేకంగా దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ వద్ద అప్పీల్ చేశారు. విచారణ జరిపిన కడలూరు జాయింట్ కమిషనర్ నటరాజ దీక్షితుల సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేశారు. దీనిని సవాలు చేస్తూ దీక్షితుల కమిటీ కార్యదర్శి వెంకటేశ దీక్షితర్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. కమిటీ నిర్ణయంలో జోక్యం చేసుకొనే అధికారం దేవాదాయశాఖకు లేదని, జాయింట్ కమిషనర్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ దండపాణి శనివారం విచారణ జరిపారు. నటరాజ దీక్షితర్ తరఫున.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల తర్వాత ఆలయం తమకు సొంతమైనదని దీక్షితులు భావిస్తున్నారని, కోర్టు దీనిని నియంత్రించాలని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి.. దీక్షితులతో తనకూ ఇబ్బంది ఏర్పడినట్లు చెప్పారు. మానసిక కష్టాలతో గుడికి వచ్చే భక్తులు అక్కడ అవమానపడుతున్నారని తెలిపారు. దీక్షితులు గర్వంతో వ్యవహరిస్తున్నారని, ఇది మంచిది కాదన్నారు. ఆలయానికి సంబంధం లేకుండా గొడవ పెట్టాలని వస్తున్నట్లు దీక్షితులు భావిస్తున్నారని, చిదంబరం నటరాజర్ ఆలయం తమకు సొంతమైనదని వారు భావిస్తున్నారన్నారు. తమను దేవుడి కంటే గొప్పవారని అనుకుంటున్నారని తెలిపారు. నటరాజర్ ఆలయంలో మాత్రమే నిర్వహించే ఆరుద్ర దర్శనం ప్రస్తుతం వివిధ ఆలయాల్లో కొనసాగుతోందన్నారు. ఈ దర్శనానికి ఇంతకు ముందు లాగా భక్తులు చిదంబరం రావడం లేదన్నారు. ఆలయంలో డబ్బులు వేస్తేనే పూలు లభిస్తాయని లేదంటే విభూది కూడా దక్కదన్నారు. అనంతరం పిటిషన్‌పై జవాబివ్వాలని దేవాదాయశాఖకు ఉత్తర్వులు ఇచ్చి తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేశారు.

డీఎంకేవి భాషా రాజకీయాలు: తమిళిసై



కోయంబత్తూరు, న్యూస్‌టుడే: తమిళాన్ని అడ్డుపెట్టుకుని డీఎంకే రాజకీయాలు చేస్తోందని భాజపా రాష్ట్ర సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ... తమిళ భాష ఒక్క డీఎంకేకే సొంతమైనట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. భాజపా వారికి తమిళంపై ప్రేమ లేదనే విధంగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన వ్యక్తీకరణే ప్రధానికి ముఖ్యమంత్రి లేఖ అని చెప్పారు. ఇకనైనా డీఎంకే భాషా రాజకీయాలను మానుకోవాలని పేర్కొన్నారు. దీపావళి తర్వాతి రోజు సెలవు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. డీఎంకే నేతల పిల్లలు ఎంత మంది తమిళంలో చదువుతున్నారని ప్రశ్నించారు. తెలియకుండా జరిగిన పొరబాటును పెద్దది చేసి రాజకీయాలు చేయడం సరికాదన్నారు.


నీలిరంగులో కనిపిస్తున్న అలలు

కనువిందు చేసిన నీలిరంగు కెరటాలు

సైదాపేట, వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై, పరిసర ప్రాంతాల్లోని సముద్ర తీరాల్లో శుక్రవారం సాయంత్రం అలలు నీలి రంగులో ప్రజలను ఆకట్టుకున్నాయి. చెన్నై నీలాంగరై, ఈంజంబాక్కం, విళుప్పురం, మరక్కాణం తదితర తీరాల్లో నీలి రంగులో కనిపించాయి. కొందరు ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ కూడా తన ఎక్స్ పేజీలో ఫొటోలను పంచుకున్నారు. కడలిలోని జీవరాశుల వలన అలలు ఇలా రంగులుగా కనిపిస్తాయని కొందరు చెబుతున్నారు.

వంతెనకు మరమ్మతులు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం-వందవాసి మార్గంలో చెవిలిమేడు సమీపంలో పాలారు నదిపై వంతెన ఉంది. దీనిపై భారీ వాహనాలు ఎక్కువగా తిరుగుతుండటంతో మరమ్మతులకు గురైంది. ఇదిలా ఉండగా గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వంతెనపై ఎక్కువగా గుంతలు పడటంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంచీపురం డివిజన్ రహదార్లశాఖ తరఫున గుంతలను పూడుస్తున్నారు.

నీట మునిగిన నేల వంతెనలు

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: పెరియపాళ్యం, ఆరణి తదితర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అరుణానదిలో వరద ఏర్పడింది. దీంతో పుదుపాళ్యం వద్ద నదిపై ఉన్న నేల వంతెన శుక్రవారం సాయంత్రం మునిగింది. వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా మంగళం వద్ద అరుణానదిపై ఉన్న కాజ్‌వే మునగడంతో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నేల వంతెనల స్థానంలో పైవంతెనలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు


విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న మంత్రులు దురైమురుగన్, గాంధీ

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా కాట్పాడి సమీప లాలాపేట ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో శనివారం జిల్లా కలెక్టరు చంద్రకళ నేతృత్వంలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. పాల్గొన్న మంత్రులు దురైమురుగన్, ఆర్.గాంధీ విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా దురైమురుగన్ మాట్లాడుతూ... విద్యార్థులు సమయానికి పాఠశాలలకు వచ్చివెళ్లేందుకు వీలుగా ఉచితంగా ప్రభుత్వం సైకిళ్లను అందజేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

47.50 అడుగులకు చేరిన వీరాణం చెరువు నీటిమట్టం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా కాట్టుమన్నార్ కోవిల్ ప్రాంతంలో ఉన్న వీరాణం చెరువులోకి మూడు రోజుల క్రితం 46 అడుగుల మేర నీరు వచ్చి చేరింది. శనివారం చెరువులో 47.50 అడుగుల మేర నీరు ఉంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం శనివారం ఉదయం చెరువును పరిశీలించారు. చెరువుకు వచ్చే అదనపు నీటిని ఆదివారం నుంచి దిగువకు విడుదల చేయనున్నట్లు ప్రజాపనులు, జలవనరుల శాఖల అధికారులు తెలిపారు.


చెరువును పరిశీలిస్తున్న మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం

మత్తుపదార్థాలతో అనర్థాలపై అవగాహన

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై నగరంలో మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన మారథాన్ శనివారం జరిగింది. అవినాశి రోడ్డులోని పోలీస్ శిక్షణ మైదానంలో 'రన్ ఫర్ ట్రాఫిక్ ఫ్రీ' శీర్షికతో జరిగిన మారథాన్‌ను నగర పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టరు క్రాంతికుమార్ పాల్గొన్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో కమిషనర్ మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు.


కోయంబత్తూరు: మారథాన్‌లో పాల్గొన్న కమిషనర్ బాలకృష్ణన్, కలెక్టరు క్రాంతికుమార్

వరద జాగ్రత్త చర్యలపై...

తిరుత్తణి: ఈశాన్య రుతుపవనాల వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో తిరువళ్లూర్ జిల్లాలో వరదల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అగ్నిమాపక సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని నల్లాన్‌కుళంలో జరిగిన కార్యక్రమంలో వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించడం తదితర అంశాలను ప్రజలకు వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మలర్‌విళి, డిప్యూటీ తహసీల్దారు గణేశ్‌కుమార్, వీఏవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.


తిరుత్తణి: రక్షణ చర్యలను వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దీపావళికి ముందే పింఛన్ అందించాలి

సీఎంకు రవాణా పింఛన్‌దారుల వినతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళికి ముందుగానే పింఛన్ అందించాలని రవాణా పింఛన్‌దారులు విన్నవించారు. ప్రభుత్వ రవాణా పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కదిరేశన్ ముఖ్యమంత్రికి పంపిన లేఖలో.. రవాణాశాఖలో పనిచేసి విశ్రాంతి పొందినవారిలో చాలామందికి రూ.10వేలలోపు పింఛను ఇస్తున్నారని చెప్పారు. 2015 నవంబరు నుంచి రాయిఈ ధర పెంపును ప్రభుత్వం నిలిపివేసిందని, పలుమార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ వ్యవహారంలో తమకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చిందన్నారు. ప్రభుత్వం అప్పీల్ చేసుకున్నా కేసు పెండింగ్‌లో ఉందన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెన్షనర్లకు సాధారణంగా 5న అందించే పింఛన్ దీపావళికి ముందుగానే ఇవ్వాలని పేర్కొన్నారు.

విద్యార్థులపై అమానుష దాడి వ్యవహారం

నీట్ శిక్షణ కేంద్ర హాస్టల్‌కు నోటీసు

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లాలోని నీట్ శిక్షణ కేంద్రంలో విద్యార్థులపై అమానుష దాడి జరిగిన నేపథ్యంలో సదరు శిక్షణ కేంద్రం వద్ద మానవ హక్కుల కమిషన్ బృందం విచారణ జరిపింది. మేళపాళయం పోలీసు స్టేషన్ పరిధిలో 'జల్' నీట్ శిక్షణ కేంద్రం కొనసాగుతోంది. అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులపై క్రమశిక్షణ పేరిట నిర్వాహకులు అమానుషంగా దాడి చేస్తున్నట్లు వెలువడిన వార్త కలకలం సృష్టించింది. ఓ విద్యార్థిపై ఉపాధ్యాయుడు విచక్షణా రహితంగా కర్రతో దాడి చేయడం, మరో విద్యార్థినిపై పాదరక్షలు విసరడం వంటి సీసీ టీవీ ఫుటేజీలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. దీనిపై మేళపాళయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు కన్నదాసన్ శిక్షణ కేంద్రంలో విచారణ జరిపినట్లు తెలుస్తోంది. అదేవిధంగా హాస్టల్‌ను తగిన అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వివరణ కోరుతూ సంబంధిత హాస్టల్‌కు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ శనివారం నోటీసు జారీ చేసింది.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కనకరాజ్

అబ్దుల్ కలాంకు నివాళి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప తిరునింద్రవూరులోని జయ కళాశాల ఆధ్వర్యంలో దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ కనకరాజ్, డీన్ జయశ్రీ, ఉప ఛైర్మన్ విజయకుమార్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకున్న తమిళనాడు పురుషుల జట్టు, మహిళల జట్టు, నిర్వాహకులు

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్లుగా తమిళనాడు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న 35వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. 347 పాయింట్లు సాధించి తమిళనాడు రాష్ట్రం ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. పురుషుల, మహిళల ఛాంపియన్‌షిప్‌లను సైతం తమిళనాడే దక్కించుకుంది. ఈ పోటీల్లో అగ్రస్థానంలో తమిళనాడు నిలవగా.. తరవాత స్థానాల్లో కర్ణాటక, తెలంగాణ, ఏపీలు నిలిచాయి.

❖ అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలవగా..ఏపీ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. అండర్-16 బాలుర విభాగంలో తెలంగాణ, కర్ణాటక, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక, తమిళనాడు, అండర్-20 బాలుర విభాగంలో తమళనాడు, కర్ణాటక రాష్ట్రాలు నిలిచాయి.

❖ అండర్-14, అండర్ -16, అండర్ -18, అండర్ -20 బాలికల విభాగంలో తమిళనాడు, కర్ణాటకలే తొలి రెండు స్థానాలలో నిలిచాయి.

❖ వ్యక్తిగత విభాగంలో అండర్-14 బాలుర విభాగంలో తెలంగాణ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్, అండర్-16 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు ఆయుష్, అండర్-18 బాలుర విభాగంలో కర్ణాటక క్రీడాకారుడు దయానంద్, అండర్-20 బాలుర విభాగంలో ఏపీ క్రీడాకారుడు షేక్ రోషన్ పతకాలు దక్కించుకున్నారు.

❖ అండర్-14 బాలికల విభాగంలో తమిళనాడు క్రీడాకారిణి ఆర్తి, అండర్-16 బాలికల విభాగంలో ఏపీ క్రీడాకారిణి డింపుల్ మహాశ్రీ, అండర్-18 బాలిక విభాగంలో కర్ణాటక క్రీడాకారిణి శృతి శెట్టి, అండర్-20 బాలికల విభాగంలో తమిళ క్రీడాకారిణి శ్రీ వర్ధినికి పతకాలు వరించాయి. విజేతలకు భారత క్రీడా సమాఖ్య ఈసీ సభ్యురాలు హైమావతి, సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌతమ్ కిరణ్ బహుమతులు ప్రదానం చేశారు.

బాణసంచా పేలి వ్యక్తి మృతి

ఆర్కేనగర్: దిండుక్కల్ జిల్లా వేడచందూర్‌లోని పెరియరావుత్తర్ వీధికి చెందిన సాహుల్ హమీద్ (47) తన తల్లితో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి సాహుల్ హమీద్ ఇంట్లో బాణసంచా పెద్ద మొత్తంలో తెచ్చిపెట్టాడు. శనివారం ఉదయం బాణసంచా పెట్టిన చోట పక్కనే సిగరెట్ తాగడంతో నిప్పురవ్వలు వాటిపై పడి పేలాయి. తీవ్రంగా గాయపడిన సాహుల్ హమీద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇంటి పైకప్పు కూలి మహిళ...

ప్యారిస్: తేని సమీప మైలాడుంపారైకి చెందిన చిన్నపొన్ను (55) పాత కాంక్రీట్ స్లాబ్ ఇంట్లో ఒంటరిగా జీవిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీవర్షానికి ఇంటి పైకప్పు కూలి పడి చిన్నపొన్ను మృతిచెందింది. శనివారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది ఆమె మృతదేహాన్ని శిథిలాల కింద నుంచి వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బలు తాళలేక దొంగ...

అరక్కోణం: రాణిపేట జిల్లా అరక్కోణం సమీప అరిగిలపాడి గ్రామానికి చెందిన మాదేశ్ (24) తన ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం రాత్రి అదే ప్రాంతంలో ఉంటున్న వేదాచలం ఇంట్లో దొంగతనానికి యత్నించారు. గుర్తించిన ఇంట్లోని వారు పెద్దగా కేకలు వేయంతో ఇరుగుపొరుగువారు వచ్చి మాదేశ్‌ను పట్టుకున్నారు. మిగిలిన ఇద్దరు పారిపోయారు. మాదేశ్‌ను చెట్టుకు కట్టేసి వేదాచలం కుటుంబ సభ్యులు కొట్టడంతో దెబ్బలు తట్టుకోలేక స్పృహకోల్పోయాడు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతన్ని అరక్కోణం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి వేదాచలం, అతని కుమారుడు విజయకుమార్‌తోపాటు మరో వ్యక్తిని అరెస్టు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు...


రెడ్‌హిల్స్: పూందమల్లి సమీప సెన్నీర్‌కుప్పానికి చెందిన గోపాలకృష్ణన్ చెన్నై అమైందకరై పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నారు. ఇతని తండ్రి సొక్కలింగం శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఇందుకోసం పందిరి ఏర్పాటు చేస్తుండగా పైన ఉన్న విద్యుత్తు తీగ తగలడంతో గోపాలకృష్ణన్ కుమారుడు శరవణన్ (25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పూందమల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు వృద్ధుడు...

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీప రాజపద్మాపురానికి చెందిన తిరుజ్ఞానం (64) రైతు. ఇతను శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా నాగుపాము కాటేసింది. కుటుంబీకులు తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తిరువేలాంగాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శుభ్రతా కార్మికుడి హఠాన్మరణం

వేలూర్: వేలూర్ కీళ్‌మోణవూర్‌కి చెందిన మురుగన్ (55) 15 ఏళ్లుగా వేలూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒప్పంద శుభ్రతా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం విధుల్లో ఉండగా ఉన్నట్టుండి మురుగన్ స్పృహకోల్పోయి కాలువలో పడ్డాడు. వెంటనే అక్కడున్న వారు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.


మురుగన్ (పాతచిత్రం)

భర్తను హత్య చేసిన భార్య, కుమారుడు అరెస్టు

వేలూర్, న్యూస్‌టుడే: భర్తను హత్య చేసిన భార్య, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తిరుప్పత్తూర్ జిల్లా కుమరన్‌నగర్‌కి చెందిన గాంధీ(65)కి భార్య కలైసెల్వి, కుమారుడు రాజీవ్‌గాంధీ ఉన్నారు. పొలంలో పూలు సాగు చేస్తున్నారు. రోజూ పూలను కోసి విక్రయించేవారు. శనివారం ఉదయం కలైసెల్వి తన భర్త గాంధీని పూలు కోసేందుకు వెళ్లమని చెప్పింది. కొంత సమయం తర్వాత వెళ్తానని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపంతో ఆమె కుమారుడితో కలిసి పారతో గాంధీ తలపై మోదింది. తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కలైసెల్వి, రాజీవ్‌గాంధీలను అరెస్టు చేశారు.

హత్య కేసులో నిందితుడు...

పొన్నేరి: మీంజూరు సమీప అరియన్‌వాయల్‌కు చెందిన సయ్యద్ హుస్సేన్ (40) షుమార్ట్ నిర్వహిస్తున్నాడు. ఇతను ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పుదుప్పేడుకు చెందిన హరీష్ అనే వ్యక్తి వస్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. దీంతో ఆవేశం చెందిన హరీష్ బండరాయితో దాడి చేయడంతో హుస్సేన్ మృతి చెందాడు. మీంజూరు పోలీసులు దర్యాప్తు చేపట్టి హరీష్‌ను శనివారం అరెస్టు చేశారు.

లంచం తీసుకున్న అధికారి...

తిరుత్తణి: తిరువళ్లూర్ జిల్లా విలాసపురం గ్రామానికి చెందిన నరసింహన్ (52) రైతు. తన వ్యవసాయ భూమిలో వేసుకునేందుకు రిజర్వాయరు మట్టి తీసుకెళ్లడానికి నందియారులోని నీటి పారుదలశాఖ అధికారి రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. మట్టి తవ్వుకోవడానికి రూ.7 వేలు ఇవ్వాలని రమేశ్ చెప్పడంతో నరసింహన్ అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు రసాయనం పూసిన కరెన్సీ నోట్లను అధికారికి ఇస్తుండగా అనిశా అధికారులు అరెస్టు చేశారు.


రమేశ్

కారు బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు



అరక్కోణం, న్యూస్‌టుడే: చెన్నై నుంచి తిరుపత్తూరు వెళుతున్న ఓ లగ్జరీ కారు రాణిపేట వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కారు డ్రైవర్ శివకుమార్‌కు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని వాలాజాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఉద్యోగిపై దాడి

రెండు సవర్ల గొలుసు దోపిడీ

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం రైల్వే పోలీసుల వివరాల మేరకు.. తిరువళ్లూరు జిల్లా సెంజిపాక్కం ప్రాంతానికి చెందిన మణి రైల్వే ఉద్యోగి. రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని పులియమంగళం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఓవర్‌హెడ్ విద్యుత్ లైను పనులు పరిశీలిస్తుండగా ఆ వైపు వచ్చిన గుర్తు తెలియని ముగ్గురు యువకులు కత్తి చూపి బెదిరించారు. ఓ సెల్‌ఫోన్, మెడలో ధరించిన రెండు సవర్ల బంగారు గొలుసు బలవంతంగా లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ముగ్గురు వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

జైలు సిబ్బందిని బెదిరించిన ఖైదీ

వేలూర్, న్యూస్‌టుడే: చెన్నై కొరుక్కుపేటకి చెందిన తెన్నరసు రౌడీషీటర్. ఇతనిపై పలు కేసులు పెండింగ్‌లో ఉన్న క్రమంలో పోలీసులు అతన్ని అరెస్టు చేసి పుళల్ జైల్లో ఉంచారు. రెండేళ్ల క్రితం వేలూర్ జైలుకి మార్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జైల్లో ఉన్న ఖైదీలకు జుట్టు కత్తిరిస్తుండగా ఖైదీలు భాస్కర్, తెన్నరసు మధ్య గొడవ జరిగింది. అప్పుడు అక్కడున్న సిబ్బంది తెన్నరసుని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో అతను పోలీసులను చంపుతానని బెదిరించాడు. దీనిపై జైలర్ అరుణ్‌కుమార్ బాగాయం పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బాలిక మృతదేహాన్ని తీసుకెళ్తున్న కుటుంబీకులు

చిరుత దాడిలో చిన్నారి మృతి

సైదాపేట, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా వాల్పారై సమీప ఊసిమలై తేయాకు ఎస్టేట్‌లో అసోం రాష్ట్రానికి చెందిన అనూల్ అన్సారీ (41) కార్మికుడు. ఇతని భార్య నసీరాన్ కూడా తేయాకు కార్మికురాలు. శనివారం వీరి నివాస ప్రాంతంలో ఓ వ్యక్తి చనిపోవడంతో భార్యాభర్తలు పనికి వెళ్లలేదు. వీరి నాలుగేళ్ల కుమార్తె అప్సర్ ఖాతూన్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా పొంచి ఉన్న చిరుత రెప్పపాటులో బాలికను నోట పట్టుకుని అడవిలోకి లాక్కెళ్లింది. అది చూసిన బాలిక తల్లి కేకలు వేయడంతో స్థానికులు చిరుతను వెంబడించారు. దీంతో బాలికను వదిలేసి వెళ్లింది. అప్పటికే బాలిక మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.


విజేతకు షీల్డు అందజేస్తున్న కమాండర్ అఖిలేష్ కుమార్

విజేతలకు బహుమతుల ప్రదానం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం సమీప నగిరికుప్పం వద్ద ఉన్న జాతీయ విపత్తు నిర్వహణ దళం (ఎన్డీఆర్ఎఫ్) కేంద్రంలో శనివారం ఇంటర్ బెటాలియన్ క్రీడా పోటీలు జరిగాయి. ఒడిశా, పుణె, విజయవాడ తదితర పట్టణాలకు చెందిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి. పోటీలను అసిస్టెంట్ కమాండర్లు వైద్యలింగం, శంకర పాండ్యన్ ప్రారంభించారు. విజేతలకు కమాండర్ అఖిలేష్‌కుమార్ ధ్రువపత్రాలు, షీల్డులు, బహుమతులు అందజేశారు.